


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ పోలీసు కమిషనర్ ఉషావిశ్వనాథ్

# పోకిరిగాళ్లతో జాగ్రత్త..

- రాచకొండ డిప్యూటీ పోలీసు కమిషనర్ ఉషావిశ్వనాథ్
- గురునానక్ విద్యాసంస్థలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం

ఇబ్రహీంపట్నంరూరల్, ఫిబ్రవరి 20 : పోకిరిగాళ్లతో విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని, సైబర్ నేరాలకు బలికావద్దని రాచకొండ డిప్యూటీ పోలీసు కమిషనర్ ఉషావిశ్వనాథ్ అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో మహిళల భద్రత కోసం పోలీసు శాఖ చేపడుతున్న చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి సమాజంలో ఎన్నో దారుణాలు జరుగుతున్నాయని, అబ్బాయిలు వారిని ప్రేమించాలని, ఒప్పుకోకపోతే దారుణాలకు పాల్పడటం వంటివి సాధారణంగా జరుగుతున్నాయన్నారు. టాక్సిక్ రిలేషన్‌షిప్ నుంచి బయటపడటానికి అమ్మాయిలు చాలా భయపడి వారికి బ్రేకప్ చెప్పేస్తే ఎలా స్పందిస్తారో అని, సోషల్ మీడియాలో గతంలో వారితో ఉన్నటువంటి ఫొటోలు, వీడియో వైరల్ చేసి అల్లరిపాలు చేస్తారనే భయంతో వేధింపులను మౌనంగా భరిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇలాంటి విషయాలపై అప్రమత్తమై పోలీసులకు, తల్లిదండ్రులకు తెలియపర్చాలని సూచించారు. ఆపదలో ఉన్న అమ్మాయిలు, మహిళలు వెంటనే షీటీమ్‌లను సంప్రదించాలని కోరారు. లేదా 100కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. మహిళలు, అమ్మాయిల భద్రత కోసం పోలీసు శాఖ కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ గగన్‌దీప్‌సింగ్ కోహ్లీ, మేనేజింగ్ డైరెక్టర్ హెచ్‌ఎస్ షైనీ, కళాశాల అధ్యాపకులు వెంకటరావు, శ్రీనాథ్‌రెడ్డి, పార్థసారథి పాల్గొన్నారు.

# వంతెన నిర్మాణాలు పూర్తిచేస్తాం



మహాత్మ బసవేశ్వర విగ్రహావిష్కరణ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు

- దోర్నాల్, నాగసముందర్ వాగు వంతెనలను పూర్తి చేయిస్తాం
- ధారూరు మార్కెట్‌కు పటేల్ సంగమేశ్వర్ నామకరణం చేస్తాం
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



బసవేశ్వర విగ్రహావిష్కరణలో ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, శుభప్రద్‌పటేల్

ధారూరు, ఫిబ్రవరి 20 : ధారూరు మండల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం ధారూరులో నూతనంగా నిర్మించిన వీరాభద్రేశ్వర ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభించారు. అనంతరం మహాత్మ బసవేశ్వర విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని, వివేకానంద విగ్రహావిష్కరణ చేసి, అనంతరం అరుణ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టులో రెండు కాలువల మరమ్మతులు చేసి రైతులకు సాగు నీరు అందిస్తామన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు పటేల్ సంగమేశ్వర్ పేరు నామకరణం చేస్తామన్నారు. కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిన ధారూరు స్టేషన్–దోర్నాల్, నాగసముందర్–ధారూరు రోడ్డు వంతెనలను పూర్తి చేయిస్తామని తెలిపారు. మండల కేంద్రంలో మహాత్మ బసవేశ్వర విగ్రహం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందు చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంటు సభ్యుడు బీబీపాటిల్ పాల్గొన్నారు.



డ్రోన్ పోర్ట్ ఏర్పాటుకు మొండిగౌరెల్లి భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో అనంతరెడ్డి తదితరులు

## మొండిగౌరెల్లిలో డ్రోన్ పోర్ట్ ఏర్పాటుకు

# స్థల పరిశీలన

పాల్గొన్న ఆర్డీవో అనంతరెడ్డి తదితరులు

యాచారం, ఫిబ్రవరి 20 : మండలంలోని మొండిగౌరెల్లి గ్రామ శివారులో డ్రోన్ పోర్ట్ ఏర్పాటుకు రెవెన్యూ అధికారులతో కలిసి ఆర్డీవో అనంతరెడ్డి మంగళవారం స్థల పరిశీలన చేశారు. మొండిగౌరెల్లిలోని సర్వే నం.19లో గల ప్రభుత్వ స్థలాన్ని స్థానిక తహసీల్దార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఫార్మా సిటీ పక్కన 20ఎకరాల్లో డ్రోన్ పోర్ట్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఇప్పటికే ఫార్మా సిటీ ఏర్పాటు కోసం స్థల సేకరణ చేసిన విషయం విదితమే. తాజాగా ఫార్మా సిటీ పక్కనే ఉన్న మొండిగౌరెల్లి శివారు ప్రాంతంలో ప్రభుత్వ భూములు ఉండటంతో అధికారులు ఇక్కడ మొగ్గు చూపుతున్నారు. పైగా ఫార్మా సిటీకి కూతవేటు దూరంలో మొండిగౌరెల్లి భూములు ఉండటంతో డ్రోన్ పైలెట్ శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ముమ్మరంగా ప్రణాళికలను రచిస్తున్నది. దీనికి సంబంధించి 20 ఎకరాల స్థల పరిశీలన చేయాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు మొండిగౌరెల్లిలో సర్వే నం.19లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ప్రాథమికంగా పరిశీలించారు. పరిశీలించిన స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం ఇస్రోకు అప్పగించనుంది. మొండిగౌరెల్లి శివారులోని ప్రభుత్వ స్థలం డ్రోన్ పోర్ట్‌కు అనుకూలంగా ఉంటే ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో డ్రోన్ పైలట్లకు అధునాతన శిక్షణా కేంద్రంగా మొండిగౌరెల్లి ప్రాంతం నిలువనుంది. ఇప్పటికే ఈ భూములను జైలు(కారాగారం), ఆయుధ పరిశ్రమల ఏర్పాటు కోసం అధికారులు సర్వే చేశారు. ప్రస్తుతం డ్రోన్ పోర్ట్ ఏర్పాటు కోసం మరోసారి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అయ్యప్ప, ఆర్ఐ రామకృష్ణ తదితరులున్నారు.

# కబడ్డీ పోటీల్లో రంగారెడ్డి బాలికల జట్టు విజయకేతనం



కబడ్డీ పోటీల్లో విజయం సాధించిన జట్టుతో జగదీశ్వర్ యాదవ్, రవి కుమార్

ఆర్కేపురం, ఫిబ్రవరి 20: అంతర్ జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో రంగారెడ్డి జిల్లా బాలికల జట్టు విజయకేతనం ఎగరవేసింది. సూర్యాపేట, చింతలపాలెంలో నిర్వహించిన 33వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీలలో రంగారెడ్డి బాలికల జట్టు భద్రాద్రి కొత్తగూడెం జట్టు పై (48–18) విజయం సాధించి చాంపియన్స్‌గా నిలిచారు. విజయం సాధించిన జట్టును రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్, సంయుక్త కార్యదర్శి రవి కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్ అభినందించారు.

# మెట్లబావి పనుల్లో వేగం పెంచాలి



మహేశ్వరంలో మెట్లబావి పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 20 : మహేశ్వరంలో ఉన్న అతి పురాతనమైన కోనేరు(మెట్ల బావి) అభివృద్ధి పనులను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. గతంలో మెట్ల బావి పునరుద్ధరణకు రూ.90 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీచేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి పూర్తి చేయాలన్నారు. పురాతన కట్టడాలను రేపటి తరాలకు చూపించవలసిన అవసరం ఉందన్నారు. చరిత్ర గుర్తులను చెదిరిపోకుండా చూడాలన్న సంకల్పంతో మెట్ల బావిని అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

## రోడ్డు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



రోడ్డు కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నందిహిల్స్‌లో రోడ్డును కబ్జా చేస్తున్నారని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి పలువురు వినతి పత్రం అందజేశారు. 20 ఫీట్ల రోడ్డును కబ్జా చేయగా 6 ఫీట్లు మిగిలిందని ఎమ్మెల్యేకు వివరించారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకునేలా చొరవ తీసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు గిరిమోని సిద్ధప్ప, యాదగిరిరెడ్డి ఎమ్మెల్యేను కలిసినవారిలో ఉన్నారు.

# సేవాలాల్ మందిరం స్థలంలో ప్రహరీ కూల్చివేత



సేవాలాల్ స్థలంలో ప్రహరీని కూల్చివేసిన రెవెన్యూ అధికారులు

బడంగ్‌పేట, ఫిబ్రవరి 20 : తెలంగాణ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సంత్ సేవాలాల్ దేవాలయం నిర్మాణానికి లెనిన్ నగర్ సర్వే నం.119లో స్థలం కేటాయించారు. అప్పుడే ఆ స్థలంలో చుట్టూ ప్రహరీని నిర్మించారు. ఇటీవల మహేశ్వరం నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆ స్థలంలోని ప్రహరీని కూల్చివేయాలని ఫిర్యాదు చేయడంతో మంగళవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారని బంజారా సంఘం నాయకులు తెలిపారు. కూల్చివేతలకు వచ్చిన అధికారులను బంజారా సంఘం నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. కూల్చివేతలకు నిరసనగా బంజారా సంఘం నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు రోడ్డు పై బైఠాయించి ఆందోళన చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పి ధర్నా విరమింప జేశారు. కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు.

# కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం


- కరోనా సమయంలో ఇతర దేశాలను ఆదుకున్నది భారతదేశమే..
- అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ.. ప్రతి ఇంట్లో పండుగ
- వికారాబాద్‌లో విజయ సంకల్ప యాత్రలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 20 : అవినీతి లేక ఏకైక పార్టీ బీజేపీ అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి వికారాబాద్‌కు విజయ సంకల్ప యాత్ర చేరుకుంది. వికారాబాద్‌లోని బీజేఆర్ చౌరస్తాలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 370 ఆర్టికల్ రద్దు కశ్మీర్‌లో కూడా ఎవరైనా ఉండగలిగేలా చేసిన ఘనత ప్రధాన మోదీదే అన్నారు. కరోనాతో ప్రపంచ దేశాలు అల్లాడుతుంటే.. భారతదేశం నుంచి కరోనా వ్యాక్సిన్‌ను పంపినట్లు గుర్తు చేశారు. అయోధ్యలో 500 ఏండ్ల నాటి రామ మందిరాన్ని నిర్మించి శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ చేసిన మహనీయుడు మోదీ అని కొనియాడారు. ప్రతి కార్యకర్త రోజుకు 5 గంటలు పని చేసి, గ్రామాల్లో ప్రజలకు ప్రధాని చేసిన పనులను వివరించాలన్నారు. 2014లో ఇంటింటికీ మరుగుదొడ్లు నిర్మించి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడారని తెలిపారు. కుటుంబ రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ కేరాఫ్‌గా ఉందని, కాంగ్రెస్ పాలనతోనే దేశం వెనుకబడిపోయిందన్నారు.

నేడు రాష్ట్రంలోని గ్రామాల్లో జరుగుతున్న అనేక అభివృద్ధి పనులకు కేంద్ర సర్కారే ప్రత్యేక నిధులు ఇస్తున్నదన్నారు. తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాల్లో గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలెక్కడని ప్రశ్నించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి, ఏవీఎన్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, సీనియర్ నాయకులు రాణి రుద్రమ, ప్రేమ్‌దర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు, బీజేవైఎం అధ్యక్షులు, కార్యకర్తలున్నారు.



విజయ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



విజయ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బీఎల్ వర్మ

# కుటుంబ రాజకీయాలకు కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ

విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి బీఎల్ వర్మ

తాండూరు, ఫిబ్రవరి 20 : కుటుంబ రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ కేరాఫ్‌గా ఉందని, కాంగ్రెస్ పాలనతోనే దేశం వెనుకబడి పోయిందని కేంద్ర మంత్రి బీఎల్ వర్మ పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరులో బీజేపీ విజయ సంకల్ప యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 500 ఏండ్లుగా భారతీయ హిందువులు చూస్తున్న అయోధ్యలో భవ్య సుందర నిర్మాణమైన రామ మందిరం కేవలం మోదీ వల్లే సాధ్యమైందన్నారు. తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని, అందుకు బీజేపీ నేతలతో పాటు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు.

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ మాట్లాడుతూ.. హిందూ ప్రజలంతా ఐక్యంతో బీజేపీకి ఓటు వేసి నరేంద్రమోదీని మూడోసారి ప్రధానమంత్రిగా చేయాలని కోరారు.

చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ సేవ కోసమే రాజకీయంలోకి వచ్చానన్నారు. ప్రజలందరి ఆశీర్వాదంతో ఎంపీగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే రమణరెడ్డి, రాష్ట్ర స్పోక్ పర్సన్ రుద్రమ, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

# నిరాధారమైన ఆరోపణలను సహించేది లేదు

మెడికల్ జేఏసీ రాష్ట్ర నాయకులు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 20 : నిజాయితీగా ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేసే అధికారులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని మెడికల్ జేఏసీ రాష్ట్ర నాయకులు అన్నారు. ఈమేరకు మంగళవారం కోఠిలోని డీహెచ్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెడికల్ జాక్ రాష్ట్ర నాయకులు బి.వెంకటేశ్వర్‌రెడ్డి, యాదానాయక్, నెహ్రూనాయక్, సుజాత రాథోడ్, రాబర్ట్ బ్రూస్, వేణుగోపాల్‌గౌడ్, రామలక్ష్మి, కర్నాటి సాయిరెడ్డి మాట్లాడుతూ.. డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌పై చేస్తున్న నిరాధార ఆరోపణలను మెడికల్ జాక్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు వివరించారు. కొందరు అధికారులు తప్పుడు ఆడియోలను సృష్టించి వాటిని మీడియాలో వచ్చేటట్లు చేసి డీహెచ్ ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అవినీతికి పాల్పడే అధికారులు ఏ స్థాయిలో ఉన్నా సహించేది లేదని, అదే విధంగా నిజాయితీగా సంక్షేమం కోసం పనిచేసే అధికారులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వారు హెచ్చరించారు. సమావేశంలో మెడికల్ జాన్ నాయకులు కిరణ్‌రెడ్డి, సకల రెడ్డి, జ్ఞానేశ్వర్, బీసీ శ్రీనివాస్, ఖలీమొద్దీన్, పాండు నాయక్, తిరుపతి నాయక్, రాజశేఖర్, శిరీష, జమాలుద్దీన్, దేవ్ సింగ్, అనిల్ కుమార్, హనుమంతరావు ఉన్నారు.

# వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కందుకూరు. ఫిబ్రవరి 20 : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ గంగాపురం చెన్నాకిషన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తిమ్మాపూరు గ్రామంలో కందుకూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం వెంకటరాజిరెడ్డి స్మారక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి లయన్స్ క్లబ్ కృషి చేస్తుందని తెలిపారు. కందుకూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ గవర్నర్ డాక్టరు మహేంద్రకుమార్‌రెడ్డి,రీజియన్ చైర్మన్ సాదు ప్రభాకర్‌రెడ్డి, అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, కార్యదర్శి కుంచకూరి వెంకటేశ్వర్లు గుప్త, కోశాధికారి రామన్‌బాబు, మాజీ అధ్యక్షుడు తాళ్ల అంజయ్య,రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్,బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'సిరిపురం' వర్ధంతి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 20 : తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన విద్యార్థి అమరుడు సిరిపురం యాదయ్యకు ఉస్మానియా యూనివర్సిటీలో ఘనంగా నివాళులర్పించారు. యాదయ్య 14వ వర్ధంతి సందర్భంగా ఆత్మబలిదానం చేసుకున్న ఓయూ ఎన్‌సీసీ గేటు సమీపంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సంస్మరణ సభ నిర్వహించి, అంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్, ప్రొఫెసర్ కోదండరాం, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతం రావు, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. యాదయ్య చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. ఆత్మత్యాగం చేసిన ప్రదేశంలోనే యాదయ్య విగ్రహాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ప్రజాప్రతినిధులను కోరారు.



సిరిపురం యాదయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

# ఒడిషాతో ఇఫ్లూ అవగాహన ఒప్పందం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 20 : ఒడిషా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఒడిషా స్కిల్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఓఎస్‌డీఏ)తో ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీని ప్రకారం, ఒడిషా యువతకు ఇంగ్లిష్‌తో పాటు విదేశీ భాషా నైపుణ్యాలను ఇఫ్లూ ఆధ్వర్యంలో నేర్పించేందుకు అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా ఇఫ్లూ వీసీ ప్రొఫెసర్ సురభి భారతి మాట్లాడుతూ.. ఇంగ్లిష్, విదేశీ భాషల బోధన, శిక్షణ అందించడంలో తమ వర్సిటీ ముందుకు సాగుతుందని చెప్పారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా యువతకు నైపుణ్యాలు పెంపొందించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ ఒప్పందం మూడేండ్ల పాటు అమలులో ఉంటుందని వివరించారు.

# కోర్టుకు శివబాలకృష్ణ హాజరు

నాంపల్లి కోర్టులు, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : అక్రమ ఆస్తుల కేసులో రిమాండ్ ఖైదీగా కొనసాగుతున్న హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణను మంగళవారం ఏసీబీ కోర్టు ఎదుట అధికారులు హాజరుపర్చారు. తమ్ముడు శివ నవీన్ కుమార్‌ను సైతం కోర్టుకు తీసుకువచ్చారు. వీరిద్దరికి 14 రోజులు రిమాండ్‌ను పొడిగిస్తూ వచ్చే నెల 5వ తేదీ వరకు ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేశారు. శివబాలకృష్ణ తమ్ముడు శివ నవీన్ కుమార్ తరపున రెండో బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. కౌంటర్ దాఖలు చేయాలని పీపీని కోర్టు ఆదేశించింది. ఈ కేసుకు సంబంధం ఉన్న ఐపీఎస్ అధికారుల గురించి సేకరించిన సమాచారం మేరకు వారికి నోటీసులు జారీ చేయనున్నారు. ఐఏఎస్ అరవింద్ కుమార్‌తో పాటు ఇతర ఐఏఎస్ అధికారుల పేర్లను పరిశీలిస్తున్నారు. సేకరించిన సమాచారాన్ని అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు.

# లా కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 20 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పలు లా కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ పరీక్షల విభాగం కంట్రోలర్, ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ, మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్‌ఎల్‌బీ, ఐదేళ్ల బీ కామ్ ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 19వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 27వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈ పరీక్షలను ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## ఐ హబ్ డేటా కేంద్రంలో ఏఐ, ఎంఎల్ టెక్నాలజీల్లో శిక్షణ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థలోని ఐ హబ్ డేటా కేంద్రం ఆధ్వర్యంలో ఏఐ, ఎంఎల్ టెక్నాలజీల్లో శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఐ హబ్ డేటా ప్రతినిధి డాక్టర్ సీకే రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్ చుట్టు పక్కల ఉన్న విద్యా సంస్థలతో కలిసి పనిచేసేలా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. అందులో 5 నెలల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం ఏఐ, ఎంఎల్ టెక్నాలజీల్లో ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్: 040–66531787లో, అదే విధంగా ఐ హబ్ డేటా వెబ్‌లో సంప్రదించాలని సూచించారు.

## పుచ్చకాయల వాహనం బోల్తా

కందుకూరు : పుచ్చకాయల వాహనం బోల్తా కొట్టగా.. వాహనంలో ఉన్న పుచ్చకాయలు రోడ్డు పాలయ్యాయి. కొన్ని బాటసారులు తీసుకెళ్లారు. ఈ ఘటన హైదరాబాద్– శ్రీశైలం రహదారిపై జరిగింది. నేదునూరుకు చెందిన రైతు తన పొలంలో పండించిన పుచ్చకాయలను వాహనంలో నింపుకొని.. హైదరాబాద్‌లో విక్రయించేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలో వెనుక టైరు పగిలి వాహనం బోల్తా కొట్టింది. దీంతో వాహనంలో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పండించిన పంట.. రోడ్డుపాలు కావడంతో రైతు నష్టపోయాడు.